ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శుక్రవారం 29 మార్చి 2024



చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠ నిఘా: ఆర్వో విష్ణుచరణ్

పాచిపెంట: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద నిరంతరం పటిష్ఠ నిఘా ఉండాలని పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సాలూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సి.విష్ణుచరణ్ ఆదేశించారు. అంతర్ రాష్ట్ర సరిహద్దులోని పికోనవలస, పద్మాపురం చెక్‌పోస్టులను గురువారం తనిఖీ చేశారు. నమోదైన కేసులు, సీజ్ చేసిన వాహనాలు, పట్టుబడిన సారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. మద్యం, నగదు అక్రమంగా తరలించకుండా 24 గంటలు నిఘాను పెట్టాలని అధికారులకు సూచించారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. కంట్రోల్ రూం నుంచి ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు.

కాలువ గట్లూ వదలట్లే

ఆక్రమణదారులకు అడ్డే లేకుండా పోతోంది. ఇప్పటికే ఎన్నో ఖాళీ జాగాలు, ప్రభుత్వ స్థలాలు వారి వశమయ్యాయి. ఇప్పుడు వారికళ్లు సాగునీటి కాలువల గట్లపై పడ్డాయి. వాటిని కబ్జా చేసి భవనాలను నిర్మిస్తోన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు. వైసీపీకి చెందిన ఓ నాయకుడి కనుసన్నల్లో వీరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. -(గరుగుబిల్లి)

- ఆక్రమణల చెరలో 'జంఝావతి'
- యథేచ్ఛగా భవన నిర్మాణాలు
- అధికారపార్టీ నేత అండ
- ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు



కొత్తవలస సమీపంలో జంఝావతి కాలువ గట్టుపై నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

జంఝావతి ప్రాజెక్టు పరిధిలోని ప్రధాన కాలువ గట్టు అధికంగా ఆక్రమణకు గురవుతోంది. పార్వతీపురం, కొత్తవలస సమీపంలోని కాలువ గట్టు పూర్తిగా రూపు మారిపోతుంది. కాలువకు ఆనుకుని యథేచ్ఛగా భవన నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తోటపల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన మార్కొండపుట్టి, గడబవలస, బంటువాని వలస గడబవలస, గిజబ నిర్వాసితులకు కొత్తవలస సమీపంలో గతంలో స్థలాలు కేటాయించారు. గడబవలస నిర్వాసితులకు సంబంధించి 1 నుంచి 49 వరకు, గిజబ నిర్వాసితులకు సంబంధించి 49 నుంచి 172 క్రమ సంఖ్య వరకు పట్టాలు అందించారు. అయితే ఈ స్థలాలకు ఆనుకుని జంఝావతి కాలువ ఉంది. కాలువ గట్టు ప్రాంతం కొంత మేర ఖాళీగా ఉండడంతో ఇక్కడ అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతం రోజుకొక మాదిరిగా దర్శనమిస్తోంది. ప్రధానంగా కాలువకు ఆనుకుని పార్వతీపురం పట్టణానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్లపై నిర్మాణాలు చేపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే ఆక్రమణదారులు దాడులకు తెగబడుతున్నారు. ప్రధానంగా ఈ ఆక్రమణల వెనుక వైసీపీకి చెందిన ప్రముఖ వ్యక్తి హస్తం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీలో పెత్తనం చెలాయిస్తున్న ఈయన చెప్పిందే వేదం అన్నధోరణి ఈ ప్రాంతంలో ఉంది. ఇతని దన్ను చూసి కాలువ గట్టు అన్న విషయం మరిచి నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న గట్టు అధికంగా ఆక్రమణలో ఉన్నా రెవెన్యూ, జంఝావతి ప్రాజెక్టుల అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్వాసితులు కాని వ్యక్తులు ఈ ప్రాంతంలో నిర్మాణాలు చేపడుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నా రు. వీరికి ప్రభుత్వ పరంగా పట్టాలు మంజూరు లేదు. అలాగే కొనుగోలు చేయలేదు. ఈ రెండు లేకపోయినా యథేచ్ఛగా నిర్మాణాలకు పూనుకుంటు న్నారు. ఇదిలాఉండగా నిర్వాసితుల కాలనీకి సంబంధించి అధికంగా నకిలీ పట్టాలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తే నకిలీ పట్టాల భాగోతం బయటపడే అవకాశం ఉంది. అలాగే జంఝావతి ప్రధాన కాలువపై నెలకొన్న ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

దర్యాప్తు చేస్తాం..

గిజబ నిర్వాసిత ప్రాంతంలో ఆక్రమణలపై దర్యాప్తు చేస్తాం. గతంలో ఎంతమందికి పట్టాలు మంజూరయ్యాయో వివరాలు సేకరిస్తాం. నకిలీ పట్టాదారులు ఉన్నట్లయితే ప్రభుత్వపరంగా చర్యలు చేపడతాం. సంబంధిత వీఆర్వో, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో దర్యాప్తు నిర్వహించి అవసరమైన చర్యలు చేపడతాం.

-వెంకటరమణ, ఉప తహసీల్దార్, పార్వతీపురం

ఫిర్యాదు చేస్తాం..

కొత్తవలస సమీపంలో జంఝావతి ప్రధాన కాలువ ఆక్రమణలపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తాం. ఆక్రమణల విషయమై మా దృష్టికి రాలేదు. కాలువ మొత్తం పరిశీలించి ఆక్రమణలు ఉన్నట్లయితే తగు చర్యలు నిమిత్తం రెవెన్యూ అధికారులకు, పోలీస్ యంత్రాంగానికి ఫిర్యాదు చేస్తాం.

-పి.శ్రావణి, జేఈ, జంఝావతి ప్రాజెక్టు, పార్వతీపురం

- కొత్త జిల్లాకు కరువైన నూతన కార్యాలయం
- స్థల పరిశీలనకే పరిమితమైన వైనం
- ఐటీడీఏ కోసం నిర్మించిన భవనం నుంచే పరిపాలన
- రెండేళ్లుగా ఇదే పరిస్థితి..



అడ్డాపుశీల ప్రాంతంలో నూతన కలెక్టరేట్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

కలెక్టరేట్ నిర్మాణమెప్పుడో?



ఐటీడీఏ భవనంలో తాత్కాలికంగా కొనసాగుతున్న కలెక్టరేట్

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: పరిపాలనా సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలు ఏర్పాటు చేశామని, ఇక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. కొత్త జిల్లా ఏర్పడి రెండేళ్లవుతున్నా నేటికీ నూతన కలెక్టరేట్‌కు నోచుకోలేదు. కేవలం స్థల పరిశీలన చేసి వదిలేశారే తప్ప పనులకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో గతంలో ఐటీడీఏ కోసం నిర్మించిన భవనంలోనే కలెక్టరేట్‌ను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ 4న నూతన జిల్లాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా కొత్తగా అవతరించింది. ఈ జిల్లా పరిధిలో పార్వతీపురం, కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నాలుగు నియోజకవర్గాల పరిధిలో 15 మండలాలు ఉన్నాయి. నూతన జిల్లా ఏర్పడిన తర్వాత కలెక్టరేట్‌కు భవ నం కరువైంది. దీంతో ఐటీడీఏ కోసం నిర్మించిన భవనంలోనే కలెక్టర్ పరిపాలనను నిర్వహిస్తున్నారు. వాస్తవానికి ఈ ఐటీడీఏ భవనాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం నిర్మించలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే అప్పటి ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్ పార్వతీపురం ఐటీడీఏ నూతన భవనం కోసం శంకుస్థాపన చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికే ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ తరుణంలో పార్వతీపురం మన్యం పేరిట కొత్త జిల్లా ఏర్పడింది. దీంతో నూతన జిల్లాకు కలెక్టర్ కార్యాలయం తప్పనిసరి కాబట్టి జిల్లా కేంద్రంలో అప్పటికే సిద్ధమైన నూతన ఐటీడీఏ భవనాన్నే తాత్కాలిక కలెక్టరేట్‌గా మార్చేశారు. సుమారు రెండేళ్ల నుంచి ఇక్కడి నుంచే కలెక్టర్ పరిపాలన నిర్వహిస్తున్నారు.

స్థల పరిశీలనతో సరి..

నూతన కలెక్టరేట్ నిర్మాణం కోసం పార్వతీపురం మండలం అడ్డాపుశీల ప్రాంతంలో స్థలాన్ని అధికారులు పరిశీలించారు. పక్కా భవనాలతో నూతన కార్యాలయాన్ని నిర్మించాలనే సంకల్పంతో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రత్యేక దృష్టిసారించి స్థలం ఎంపిక పూర్తి చేశారు. ప్రభుత్వ ఆమోదం కోసం ప్రతిపాదనలు పంపించి సఫలీకృతులయ్యారు. కానీ, భవన నిర్మాణానికి నేటి వరకు ఒక్క రాయికూడా పడలేదు. శంకుస్థాపన కార్యక్రమం కూడా చేపట్టలేదు. దీంతో కొత్త జిల్లాకు కలెక్టర్ కార్యాలయం లేని పరిస్థితి ఏర్పడింది. కాగా, అడ్డాపుశీలలో కలెక్టరేట్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలను పంపించిన తర్వాత ఒక్కసారిగా ఆ ప్రాంతంలో భూములకు భారీగా డిమాండ్ ఏర్పడింది. కలెక్టరేట్ ఏర్పాటు జరగలేదు గానీ భూముల ధరలకు మాత్రం రెక్కలు వచ్చాయని అక్కడి రైతులు చెబుతున్నారు.

అద్దె భవనాల్లో మరికొన్ని..

జిల్లాలో చాలా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, జిల్లా రిజిస్ట్రేషన్, తదితర ప్రభుత్వ కార్యా లయాలు రెండేళ్లుగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ భవనాల్లో కనీస మౌలిక సౌకర్యాలు కరువయ్యాయి. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు లేకపోవడంతో సంబంధిత అధికారులు, సిబ్బందితో పాటు పనుల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త జిల్లా ఏర్పాటు చేసిన ప్రభుత్వం అందుకు తగ్గట్లు సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

టెండర్లు పిలిచాం..

నూతన కలెక్టరేట్ నిర్మాణానికి సంబంధించి అవసరమైన టెండర్లు పిలిచాం. టెండర్లు ఖరారు జరిగిన వెంటనే పనులు ప్రారంభమవుతాయి.

-ఎస్.వేణుగోపాలరావు, జిల్లా ఇన్‌చార్జి ఇంజనీరింగ్ అధికారి

కబళించిన మృత్యువు

- కొట్టక్కి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ముగ్గురి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు
- మృతుల్లో ఇద్దరిది సాలూరు గొల్లవీధి



యశోదకృష్ణ (ఫైల్)



పురుషోత్తం (ఫైల్)



శ్రీను మృతదేహం

సాలూరు, మార్చి 28: విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని కొట్టక్కి వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఎస్‌ఐ జ్ఞానప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలం జన్నివలస గ్రామానికి చెందిన జొన్నాడ పురుషోత్తం (25) గురువారం రాత్రి 8.30 గంటల సమయంలో సాలూరు నుంచి టూ వీలర్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈయనతో పాటు జి.రాంప్రసాద్, జి.గణేష్ ఉన్నారు. సాలూరు గొల్లవీధికి చెందిన గొట్టేడ శ్రీను (45), గుండుబోయిన యశోద కృష్ణ (22) రామభద్రపురం వైపు నుంచి టూ వీలర్‌పై సాలూరు వెళ్తున్నారు. జాతీయ రహదారిపై ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు బైకులూ కొట్టక్కి వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి ఢీకొన్నాయి. పురుషోత్తం తలకు తీవ్రమైన గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. శ్రీను, కృష్ణలు సాలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. జన్నివలసకు చెందిన గణేష్, రాంప్రసాద్‌లు తీవ్ర గాయాలతో విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటన స్థలాన్ని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ తిరుమలరావు పరిశీలించారు. పురుషోత్తం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బాడంగి సీహెచ్‌సికి తరలించారు. జి.శ్రీను, యశోదకృష్ణల మృతదేహాలను సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు ఆస్పత్రుల వద్ద బంధువుల రోదనలతో తీవ్ర విషాదం నెలకొంది.



గాయపడిన రాంప్రసాద్



తీవ్రంగా గాయపడిన శరత్ గణేష్ నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఇప్పుడే వస్తానని వెళ్లి..

సాలూరు గొల్లవీధికి చెందిన యశోద కృష్ణ పట్టణంలోని ఓ చికెన్‌షాపులో పని చేస్తున్నాడు. గురువారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి పానీ పూరి తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు ఇచ్చాడు. మళ్లీ ఇప్పుడే వస్తానని చెప్పి మరోసారి బయటకు వెళ్లిన కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడ్డాడు. ఇంటికి చేదోడు వాదోడుగా ఉన్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులతో పాటు యశోదకృష్ణ అన్నదమ్ములు వీర్రాజు, బాలకృష్ణ, అక్క కనక బోరున విలపిస్తున్నారు.

ఆ పిల్లలకు దిక్కెవరు..

సాలూరు గొల్లవీధికి చెందిన గొట్టేడ శ్రీను భార్యకు దూరంగా ఉంటున్నాడు. ఇళ్లకు రంగులు వేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. రోడ్డు ప్రమాదంలో ఆయన మృతిచెందడటంతో ఆ పిల్లలకు దిక్కు ఎవరని బంధువులు విలపిస్తున్నారు.

అక్రమ రవాణాపై నిఘా పెట్టండి: ఎస్పీ

గుమ్మలక్ష్మీపురం, మార్చి 28: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కురుపాం మండలంలోని ములిగూడ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తనిఖీ చేశారు. గంజాయి, సారా, నగదు అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒడిశా సరిహద్దు గ్రామాలైన లడ, కొందుకుప్ప, సమస్యాత్మక గ్రామమైన చింతలపాడు పోలింగ్‌స్టేషన్లను ఎస్పీ సందర్శించారు. వాటి స్థితిగతులు, మౌలిక సౌకర్యాలు, భద్రతపరమైన ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎల్విన్‌పేట సీఐ పి.సత్యనారాయణ, ఎస్‌ఐ శివ ప్రసాద్ ఉన్నారు.

మలేరియా ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించాలి

పాచిపెంట, మార్చి 28: మలేరియా ప్రభావిత ప్రాంతాలపై దృష్టి సారించాలని ఎన్‌సీవీబీడీసీ రాష్ట్ర ఉప సంచాలకుడు ఏటీ రామనాథరావు తెలిపారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ, జ్వరాలు నమోదు వివరాలు, నిర్ధారణ పరీక్షలు, అందజేస్తున్న చికిత్స వివరాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎం-3, ఎంఎఫ్-7 ల్యాబ్ రికార్డులను నిశితంగా పరిశీలించి నివేదికలు స్పష్టంగా ఉండాలని అన్నారు. జ్వర లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన వారి నుంచి రక్తపూతలు సేకరించాలన్నారు. మలేరి యా ప్రభావిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వేలెన్సు, ఫోకల్ స్ప్రేయింగ్, తదితర నివారణ చర్యలు చేపట్టాలని క్షేత్ర స్థాయి సిబ్బందిని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, ఏఎంవోలు సూర్యనారాయణ, డీవీ రమణ, జిల్లా వీబీడీ కన్సల్టెంట్ రామచంద్ర, వైద్యాధికారులు వెంకటరమణ, సుజాత పాల్గొన్నారు.

వైసీపీలో కుమ్ములాట

- పార్వతీపురం అభ్యర్థి జోగారావుకు అసమ్మతి సెగ
- సమావేశమైన ప్రసన్నకుమార్ వర్గం
- ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారని ప్రచారం

పార్వతీపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నియోజకవర్గంలో వైసీపీ నాయకులు కుమ్ములాటకు దిగుతున్నారు. వైసీపీ అభ్యర్థిగా అలజంగి జోగారావు పేరును అధిష్ఠానం ఖరారు చేసినప్పటి నుంచి అసంతృప్తి జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఈ టిక్కెట్‌ను ఆశించిన టిడ్కో చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్ వర్గం నుంచి జోగారావుకు అసమ్మతి సెగ తగులుతోంది. జోగారావుకు టిక్కెట్ ఇవ్వడంపై ఈ వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. తనకు టిక్కెట్ ఇస్తానని జగన్మోహన్‌రెడ్డి 2019 లోనే మాట ఇచ్చారని, కానీ ఇప్పుడు జోగారావుకే మళ్లీ అవకాశం ఇవ్వడం ఏమిటని ప్రసన్నకుమార్ ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో భవిష్యత్తు కార్యాచరణ ఏంటో చెప్పాలని ప్రసన్నకుమార్‌పై సోషల్ మీడియా ద్వారా ఆయన వర్గీయులు ఒత్తిడి చేస్తున్నారు. ప్రసన్నకుమార్ ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారని ఆయన వర్గీయులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రసన్నకుమార్ నిర్ణయం ఎలా ఉంటుందని ఆయన అభిమానులతో పాటు వర్గీయులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. గురువారం తన అనుచరులతో ప్రసన్నకుమార్ సమావేశం నిర్వహించారు. పార్వతీపురం నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా వైసీపీలో రెండు గ్రూప్‌లు ఉన్నాయి. జోగారావు, ప్రసన్నకుమార్ వర్గాల మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయి. ఇప్పుడు ఎన్నికల సమయంలో ఏకతాటిపైకి రావడం కష్టమేనని రాజ కీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. 'నాకు ఎవరితోనూ వ్యక్తిగత విభేదాలు లేవు. గతంలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఈ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం నాకే ఇవ్వాలి. ఈ విషయాన్ని అధిష్ఠానం వద్దే తేల్చుకుంటానని' చెప్పారు.



అనుచరులతో మాట్లాడుతున్న జమ్మన ప్రసన్నకుమార్

కొఠియాలో రగడ

- దిగువ గంజాయిభద్రలో విద్యుత్ మీటర్లు బిగించేందుకు వెళ్లిన ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది
- అడ్డుకున్న ఒడిశా పోలీసులు
- గిరిజనుల తీవ్ర ఆగ్రహం



ఏపీఈపీడీసీఎల్ సిబ్బందిని అడ్డుకుంటున్న ఒడిశా పోలీసులు

సాలూరు రూరల్, మార్చి 28: కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఒడిశా మళ్లీ గొడవకు దిగింది. ప్రధాని జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది గురువారం కొఠియా గ్రూప్ గ్రామం దిగువ గంజాయిభద్రలో ఇంటింటికీ వెళ్లి విద్యుత్ మీటర్లు బిగిస్తుండగా ఒడిశా పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఏపీఈపీడీసీఎల్ అధికారులు పర్యటించి విద్యుత్ మీటర్లు బిగించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ మేరకు కొఠియా గ్రూప్ గిరిజనులు తమకు విద్యుత్ మీటర్లు కావాలని సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తులు చేసుకున్నారు. 39 మంది గిరిజనులకు విద్యుత్ మీటర్లు మంజూరయ్యాయి. వాటిని బిగించడానికి ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది తొలుత దిగువ గంజాయిభద్ర వెళ్లారు. ఈ విషయం తెలిసిన ఒడిశాకు చెందిన కొఠియా పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకొని ఏపీ సిబ్బందిని అడ్డుకున్నారు. దీనిపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఇళ్లకు విద్యుత్ మీటర్లు వేయాలని తామే దరఖాస్తు చేసుకున్నామని, ఎందుకు అడ్డుకుంటున్నారని ఒడిశా పోలీసులను గెమ్మెల బీసు ఆధ్వర్యంలో గిరిజనులు నిలదీశారు. తమకు ఇష్టపూర్వకంగా ఏపీ అధికారులు మీటర్లు బిగిస్తున్నారని చెప్పారు. దీంతో పోలీసులు వెనుదిరిగి వెళ్లి ఒడిశా అధికారులకు విషయం చెప్పారు. ఆ వెంటనే పొట్టంగి బీడీవో సుకాంత్ కుమార్ పట్నాయక్, పొట్టంగి తహసీల్దార్ బీరేంద్రసింగ్ బహదూర్ దరువాలు దిగువ గంజాయిభద్రకు వచ్చారు. కొఠియా గ్రూప్ గ్రామాల్లో ఏపీ అధికారులు పనులు చేయాలంటే తమ కలెక్టర్ (కోరాపుట్ జిల్లా కలెక్టర్) నుంచి అనుమతి తీసుకోవాల్సిందేనన్నారు. ఎన్నికల కోడ్ సైతం అమల్లో ఉన్నందున ఏపీ అధికారులు ఎటువంటి పనులు చేయకూడదన్నారు. ఏపీకి చెందిన సిబ్బందిని, మీటర్లతో ఉన్న ఆటోను కొఠియా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనను ఏపీకి చెందిన కొఠియా సర్కిల్ పోలీసులు తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరో వైపు ఏపీఈపీడీసీఎల్ అధికారులు కూడా తమ ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో కోరాపుట్ జిల్లా కలెక్టర్ కీర్తి వాసన్‌తో ఏపీ ఉన్నతాధికారులు మాట్లాడినట్టు తెలిసింది. వెంటనే విద్యుత్ మీటర్లతో ఉన్న ఆటోను, సిబ్బందిని విడుదల చేశారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

కొఠియా గ్రూప్ దిగువ గంజాయిభద్రలో విద్యుత్ మీటర్లు బిగిస్తుంటే ఒడిశా పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. వారి మార్గదర్శకాలు, రెవెన్యూ అధికారుల సహకారంతో త్వరలో కొఠియా గ్రూప్ గ్రామాల్లో మీటర్లు బిగించడానికి చర్యలు తీసుకుంటాం.

-వీవీ కిశోర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏపీఈపీడీసీఎల్



దిగువ గంజాయిభద్రకు తీసుకెళ్లిన విద్యుత్ మీటర్లు



మీటర్లు కావాలని డిమాండ్ చేస్తున్న దిగువ గంజాయిభద్ర గిరిజనులు బీసు తదితరులు

ఎక్కడి పనులు అక్కడే..

- ఇదీ వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి తీరు
- బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిన నిర్మాణాలు
- టీడీపీ మంజూరు చేసిన పథకంపై నిర్లక్ష్యపు నీడలు

శృంగవరపుకోట రూరల్

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి ఒకడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కు అన్న చందంగా తయారైంది. ప్రభుత్వ భవనాలు, రహదారులు ఇలా అనేకం హామీలకే పరిమితం కాగా అక్కడక్కడా నిర్మాణాలు మొదలైనా పూర్తి కావడం కష్టమైంది. పెదఖండేపల్లి పంచాయతీలో గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతుభరోసా కేంద్రం పనులు ఐదేళ్ల క్రితం ప్రారంభించారు. చాలా రోజులు కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో చేతులెత్తేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో వీరికి బిల్లులు మంజూరు చేసినా ఇవి పూర్తి కాని పరిస్థితి. అసంపూర్తి భవనాలు పేకాటరాయుళ్లు, మందు బాబులకు అడ్డాగా మారాయి. గత ఏడాది జూన్ తరువాత ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఎస్.కోట నుంచి పెద ఖండేపల్లికి బీటీ రోడ్డు మంజూరు చేశారు. ఇదిగో రూ.రెండు కోట్లు విడుదల చేస్తున్న జీవో అంటూ ఒకవైపు ఎమ్మెల్యే వర్గం.. మరో వైపు ఎమ్మెల్సీ వర్గం ప్రచార హోరుతో ఊదరగొట్టారు. జీవోలు వచ్చినా.. నిధులు రాకపోవడంతో పనులు ఆదిలోనే నిలిచిపోయాయి. ఇక మండలంలోని కొట్టాం పంచాయతీ బందారువాని పాలెంకు అదే ఉప ముఖ్యమంత్రి ఎన్ఆర్‌జీఎస్ కింద నిధులు మంజురు చేశారు. ఆ గ్రామానికి తారురోడ్డు వేసేస్తాం అంటూ ప్రచారం చేశారు. కానీ అక్కడా అంతే.. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇంకా అనేక పనులు బిల్లులు రాక ఎక్కడివి అక్కడే ఉన్నాయి.


గత ఏడాది బీటీరోడ్డు వేస్తామని చెప్పిన ఎస్.కోట-పెదఖండేపల్లి రహదారి


గత ప్రభుత్వంలో నిర్మించిన సాయిరాం ఎత్తిపోతల పథకంను నేటికి ప్రారంభించకుండా వదిలేసిన వైసీపీ ప్రభుత్వం

టీడీపీ పథకమని...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019కు ముందు ధర్మవరంలో సాయిరాం ఎత్తిపోతల పథకం ఉండేది. అయితే ఇది పూర్తిగా పనికి రాకుండా మారడంతో నాటి ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి.. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి రూ.రెండు కోట్లు ఇస్తే 500 ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని చెప్పారు. దీంతో వేములాపల్లి గోస్తనీ నది తీరాన్ని ఆనుకొని కొత్త పథకం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడంతో చకచకా పనులు కదిలాయి. ఈలోపు ఎన్నికలు రావడంతో బ్రేకులు పడ్డాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తమది రైతుల ప్రభుత్వం అని ఉదరగొట్టింది తప్ప రూ.రెండు కోట్లతో తలపెట్టిన సాయిరాం ఎత్తిపోతల పథకం ప్రారంభించేందుకు కనీసం ప్రయత్నం చేయకపోవడం దారుణం. వారి హయాంలో నిర్మించిన పథకం మనం ప్రారంభించడం ఎందుకనే ధోరణిలో దీని విషయం గాలికి వదిలేశారు. దీంతో పొలాలు బీడువారిపోయాయని రైతులు వాపోవడం తప్ప ఇంకేం చేయలేక పోయారు. దీనిపై ప్రశ్నిస్తే తమపై ఎక్కడ కక్ష సాధింపులు ఉంటాయోనని నోరు మెదపకుండా... ప్రారంభం కాని ఎత్తిపోతల పథకం వైపు చూడటం తప్ప ఏమీ చేయలేక నిస్సహాయంగా ఉండిపోయారు. ఈ పథకం ప్రారంభానికి ముందే ఏళ్ల తరబడి నిర్వహణ లేక మరమ్మతులకు గురైంది. సంబంధిత శాఖ దీనిని పట్టించుకోకపోవడం గమనార్హం. మరి దీనికి మంచి రోజులు ఎప్పుడు వస్తాయో చూడాలి.

ఉచిత కంటి వైద్య శిబిరం

విజయనగరం రూరల్: జొన్నవలస గ్రామంలో గురువారం డాక్టరు చిట్టి రమణరావు ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఆసుపత్రి వారు సొంత నిధులతో చేయించారు. రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

రేగిడి: మండల భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు గురువారం ఫిజియోథెరపీ వైద్యులు ఎం రమా చంద్రిక నిర్వహించారు. దివ్యాంగ పిల్లలకు తల్లిదండ్రులు ఇంటివద్ద ఎటువంటి వ్యాయామాలు చేయాలో వివరించారు. దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ చేయించడంవలన వారి వచ్చే మార్పులను వివరించారు. ఎంఈవో ప్రసాద్‌రావు, ఎంఈవో-2 ఎరకయ్య ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం రూరల్: టీడీపీ అవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు నాయకులు ఐవీపీ రాజు, పిల్లా విజయ్‌కుమార్ చెప్పారు. గురువారం ఉదయం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఆనాడు ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. టీడీపీ నాయకులు, విజ్జపు ప్రసాద్, కనకల మురళీమోహన్, ప్రసాదుల ప్రసాద్, గంటా పోలినాయుడు, కంది సాయి జగ్గారావు, ముద్దాడ చంద్రశేఖర్, నడిపల్లి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలంటే అంత చులకనా?

బాడంగి: ఇటీవల ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు గిరిజన మహిళ చీర, జాకెట్టు, కట్టూబొట్టుల గురించి అవహేళనగా మాట్లాడడం హేయమైన చర్యని రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ, గజరాయనివలస ఎంపీటీసీ సభ్యులు పాలవలస గౌరు అన్నారు. సభ్యసమాజం తలదించుకునే విధంగా మాట్లాడడం అన్యాయమని తీవ్రంగా ఖండించారు. భవిష్యత్తులో ఇలా ఎస్టీలను అవహేళన చేసినట్టు ఏ ఒక్క వైసీపీ లీడర్ మాట్లాడినా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

జమ్ము నారాయణపురంలో జయహో బీసీ

విజయనగరం రూరల్: విజయనగరం మండల పరిధిలోని జమ్మునారాయణపురంలో జయహో బీసీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు బొద్దల నర్సింగరావు మాట్లాడుతూ బీసీల సంక్షేమం, అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం నాయకులు కంది మురళీనాయుడు, కోండ్రు శ్రీనివాస రావు, గంటా పోలినాయుడు, కంది సాయిజగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భగవద్గీతపై ప్రవచనాలు

విజయనగరం రింగురోడ్డు: కొత్తపేటలోని మన్నార్ రాజగోపాల స్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3 వరకూ భగవద్గీతలోని రెండో అధ్యాయం సంఖ్యా యోగంపై ప్రవచనాలు ఏర్పాటు చేస్తున్నట్టు నిష్కామ ఫౌండేషన్ ఆధ్యాత్మిక ప్రవచకులు అరుణ తెలిపారు. గురువారం మన్నార్ రాజగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకూ ప్రవచనాలు ఉంటాయన్నారు. యువత భగవద్గీత గురించి తెలుసుకోవాలన్నారు. ఈ గ్రంథం ఒక కాలానికో, మతానికో, వయస్సుకో సంబంధించినది కాదన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఫౌండేషన్ ప్రతినిధులు నరసింహారావు, కాపుగంటి వరహాలు, సూర్యకాంతం, జి.వీ రభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'రౌతు'కు పతంజలి పురస్కారం

విజయనగరం దాసన్నపేట: ప్రముఖ రచయిత, సంపాదకులు, హోమియో వైద్యులు కేఎస్‌వై పతంజలి 72వ జయంతి సందర్భంగా ఏటా అందజేసే రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈ ఏడాది పార్వతీపురానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా కంటెంట్ హెడ్ రౌతు బంగారు నాయుడిని ఎంపిక చేసినట్టు కేఎస్‌వై పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి బాబ్జీ, ఎంకే బాబు తెలిపారు. గురువారం ఆర్ అండ్ బీ సమీపంలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ మే 17న ఈ పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. సంస్థ ప్రతినిధులు ప్రభాకరరావు, రామచంద్ర రాజు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ హుండీ లెక్కింపు

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ చదురు, వనం గుడుల హుండీ లెక్కింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈఓ డీవీవీ ప్రసాదరావు ఆధ్వర్యంలో స్థానిక శివాలయం వీధిలోని పైడిమాంబ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగింది. చదురుగుడికి సంబంధించి రూ.10 లక్షల 94 వేల 587 నగదు, బంగారం 24 గ్రాముల 400 మిల్లీగ్రాములు, వెండి 92 మిల్లీగ్రాములు వచ్చింది. వనంగుడికి రూ.8 లక్షల 38 వేల 713 నగదు, 5 గ్రాముల 400 మిల్లీగ్రాములు బంగారం, 315 గ్రాముల వెండి వచ్చింది.


దాదీ జానకి స్థితప్రజ్ఞురాలు

బొబ్బిలి: బ్రహ్మకుమారి రాజయోగిని దాదీ జానకి స్థిత ప్రజ్ఞురాలు అని మున్సిపల్ కమిషనరు లాలం రామలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాదీ జానకి 4 వ పుణ్యస్మృతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరు పాల్గొని నివాళులు అర్పించారు. బ్రహ్మకుమారీస్ శాఖలను 135 దేశాలకు విస్తరింపజేయడంలో దాదీ కృషి అమోఘమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జగన్నాథనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

తెర్లాం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరగడానికి పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు మండల పరిధిలో గురువారంలో విజయ రాంపురం, అప్పలంపేట, గోలుగువలసలో స్థానిక ఎస్ ఐ రమేష్ అధ్యక్షతన గ్రామల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న సూర్యారావు

శృంగవరపుకోట: గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు డి.సూర్యారావు కోరారు. గురువారం శృంగవరపుకోటలో విలేకరులతో మాట్లాడారు. ఏప్రిల్ 14 నుంచి ఈ సభలు జరగనున్నాయన్నారు. ఆయన వెంట ఎల్.సాంబమూర్తి, సీహెచ్ రామకృష్ణ, ఆర్.సూరి దేముడు, అప్పారావు, జి.ధనంజయ తదితరులు వున్నారు.

టీడీపీలోకి పలువురి చేరిక

● ఆహ్వానించిన విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్


ఎస్.కోట పుణ్యగిరిలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన కార్యకర్తలతో శ్రీభరత్

శృంగవరపుకోట: శృంగవరపుకోట యడ్లవీధి, పుణ్యగిరికి చెందిన పలువురిని విశాఖ పార్లమెంటు టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ పార్టీలోకి ఆహ్వానించారు. గురువారం ఉదయం పార్టీ నూతన కార్యాలయం ప్రారంభ సమయంలో యడ్లవీధికు చెందిన సుమారు 100 కుటుంబాలు పార్టీ కండువా కప్పుకున్నాయి. నాయకులు డి.దినేష్, పి.వెంకటరావు, సంతోషి, కె.వెంకటరావుతో సహ సన్యాసమ్మ, గౌతమి, హరిత, కృష్ణమ్మ, ఈశ్వరమ్మ తదితర కుటుంబాలకు చెందిన సభ్యులు కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో చేరేందుకు వచ్చారు. పుణ్యగిరిలో ఎన్నికల ప్రచారం నిమిత్తం ఇంటింటికి తిరిగేటప్పుడు స్థానిక ఎంపిటీసీ దారగిరితో సహ 25 కుటుంబాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీభరత్ చేతులమీదగా పార్టీ కండువా కప్పుకున్నారు.

ఎస్.కోటలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

శృంగవరపుకోట: కోళ్ల లలిత కుమారి కుటుంబంతో మాకు దశాబ్దాల అనుబంధం ఉందని విశాఖ పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. గురువారం శృంగవరపుకోట పట్టణంలో నియోజకవర్గస్థాయి పార్టీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బాగుంటేనే మనమందరం బాగుంటామని, పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. టీడీపీ అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బుచ్చి అప్పలరామ ప్రసాద్, ఎంపీపీ సోమేశ్వరరావు, వైఎస్ఎంపీపీ ఇందుకూరి సుధారాణి, సర్పంచ్ సంతోషి కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, నాయకులు కొండం మల్లేశ్వరరావు, రెడ్డి వెంకన్న, కాపుగంటి వాసు, చెక్క కిరణ్, కరెండ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, కోళ్ల శ్రీను, లాలం అర్జునరావు, కొట్యాడ రమణ మూర్తి, దాసరి లక్ష్మి తదితరులున్నారు.

రేపు రామనారాయణం దశమ వార్షికోత్సవం


పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

విజయనగరం రింగురోడ్డు: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామ నారాయణంలో ఈ నెల 30న దశమ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించ నున్నట్టు ఎన్‌సీఎస్ ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్ వెల్లడించారు. గురు వారం రామనారాయణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ 30న ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, ఆ తరువాత ప్రాతఃకాల అర్చన, సర్వదేవతా మూర్తుల అష్టకలశ స్నపన, విశేష అర్చనలు ఉంటాయ న్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు పూర్ణాహుతి, సాయంత్రం ఐదు గంటలకు సీతా కోదండ రామ స్వామికి శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణునికి ఏకకాలంలో వైఖానస ఆగమానుసారంగా కళ్యాణోత్సవం నిర్వహిస్తామని తెలి పారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లయ అర్చకులు చాణిక్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని ముక్కలు చేసిన జగన్


మాట్లాడుతున వెంకటేశ్వరరావు

బొబ్బిలి: రాష్ట్రాన్ని ముక్కలుగా చేసి పరిపాలన సాగించిన జగన్ అభివృద్ధి మాట పూర్తిగా మరిచి పోయారని సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వరరావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక ఓ హోటల్‌లో గురువారం సాయంత్రం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అచ్చెన్నాయుడు అధ్యక్షతన అభ్యర్థులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో 35 లక్షల ఎకరాల సాగుభూములున్నప్పటికీ అందులో రెండు లక్షల ఎకరాలకు నీరివ్వలేని అసమర్థప్రభుత్వమన్నారు. 16 ప్రాజెక్టులు ఉన్నప్పటికీ రైతులకు మేలు చేయడం లేదన్నారు. సొంత బాబాయ్ వివేకానంద హత్య కేసు మిస్టరీని తేల్చకుండా నిందితులను కాపాడుతున్నారని ఆరోపించారు. బీజేపీ మతతత్వ పార్టీ అని, ఆ పార్టీతో దేశానికి ఎంతో నష్టమన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థిగా రెడ్డి కిరణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ మహిళా అధ్యక్షురాలు, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి జాలాది విజయ, ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డి కిరణ్‌కుమార్, అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపకుడు సోరు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రూ.1.63 కోట్ల పీఎఫ్ బకాయిలు

బొబ్బిలి: శ్రీలక్ష్మీ శ్రీనివాసా జూట్‌మిల్లులో 1200 మంది కార్మికులకు 1.63 కోట్ల రూపాయల పీఎఫ్ బకాయిలను యాజమాన్యం చెల్లించకపోయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని సీఐటీయూ నాయకుడు పి.శంకరరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూతపడిన పరిశ్రమలను తెరిపిస్తామని వాగ్దానాలు కురిపించి అధికారంలోకి వచ్చిన తరువాత వాటి మూసివేతకు దారులు వేశారని ఆరోపించారు. 312 మంది కార్మికులకు 55 ఏళ్లు నిండిపోయాయని, వారంతా పెన్షన్ రాక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు కార్మికుల బకాయిలన్నిటినీ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం చేస్తామని తెలిపారు. ఎస్.గోపాలం, యుగంధర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు సీఎం కావాలి


మాట్లాడుతున్న అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు సీఎం కావాలని, అందుకు ప్రజలంతా సహకరించాలని టీడీపీ, జనసేన, బీజెపీ కూటమి అభ్యర్థి అదితి గజపతిరాజు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి, నదుల అనుసంధానం, పారిశ్రామిక అభివృద్ధి కోసం దేశంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలో జగన్ పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, గంటా పోలినాయుడు, అల్తి బంగారుబాబు, పిల్లా విజయ్‌కుమార్, కంది మురళీనాయుడు, ముద్దాడ చంద్ర శేఖర్, నడిపిల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన వేగవంతం

విజయనగరం నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో బూత్‌లవారీగా ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదితి గజపతిరాజు ఒక ప్రకటనలో కోరారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వద్దకు వెళ్లి పరిశీలిస్తే ఫలితం ఉంటుందన్నారు. నగర పరిధిలోని 37వ డివిజన్ బీసీ కాలనీ రామాలయం ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ బూత్ స్థాయి కన్వీనర్లు, డివిజన్ కమిటీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నగర కార్యదర్శి ఏప రాజు, బూత్ కన్వీనరు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రామభద్రపురం, మార్చి 28: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. మండల పరిధిలోని మిత్తివలస, జన్నివలస గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామంలో ఎటువంటి రాజకీయ విబేధాలు లేకుండా ఐకమత్యంతో ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. సీఐ తిరుమలరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్ పాల్గొన్నారు.

వినూత్నంగా బేబీనాయన ప్రచారం


పేడ గెత్తాన్ని స్వయంగా ఎత్తుతున్న బేబీనాయన

బొబ్బిలి, మార్చి 28: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) బొబ్బిలి పట్టణంలో ఇంటింటి ప్రచారాన్ని వినూత్నంగా నిర్వహించి అందరినీ ఆకట్టుకుంటున్నారు. గురువారం 28వ వార్డులో నిర్వహించిన ప్రచారంలో భాగంగా ఆయన పశువుల పేడ(గెత్తా న్ని)ను ట్రాక్టరుకు ఎత్తుకుంటున్న ఓ రైతు దగ్గర నుంచి పార తీసుకొని తానే స్వయంగా తట్టతో గెత్తాన్ని ఎత్తి అందించారు. పుట్టుకతో శ్రీమంతుడైన జమిందార్ బిడ్డ ఇలా తమ జీవనస్థితి గతులను గమనిస్తూ భరోసా కల్పిస్తుండడం తమకు ఎంతో ఆనందంగా ఉందని ఓటర్లు వ్యాఖ్యానిస్తున్నారు. బేబీనాయన తన ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీమంత్రి, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పెద్దింటి జగన్మోహనరావును కలిసి ఆయన మద్దతును కోరారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, జనసేన పార్టీ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి, రాంబార్కి శరత్‌బాబు, పువ్వల శ్రీనివాసరావు, రౌతు రామ్మూర్తి, గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠలో..

తెర్లాం: మండలంలో అర్.గదబవలసలో నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీతారాముల విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు, మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వీటికి కోడ్ వర్తించదా?



మూతపడని శిలాఫలకాలు, యాప్‌లో జగన్ ఫొటో

బొబ్బిలి: పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో గల శిలాఫలకాలను అధికారులు చాలా చోట్ల మూయించారు. స్థానిక పోలీసుస్టేషన్- తహసీల్దారు కార్యాలయాలకు ముందు ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకొని ఉన్న శిలాఫలకాలను ఏ కారణంచేతనో అలాగే వదిలేశారు. వాటిపై అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మున్సిపల్ కౌన్సిలర్ల పేర్లన్నీ ఉన్నాయి. నడిరోడ్డుపై ఉన్న ఆ శిలాఫలకానికి కోడ్ వర్తించదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కళాశాలల్లో విద్యార్థుల అటెండెన్స్ యాప్‌లలో సైతం సీఎం జగన్ ఫొటో యథాతథంగా కనిపిస్తోంది. ఈ ఫోటోను తొలగించకపోవడం పట్ల విమర్శలు ఎదురవుతున్నాయి.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో గల పలు పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి గురువారం అధికారులతో కలిసి పరిశీ లించారు. పాత బొబ్బిలి శ్రీవెంకటేశ్వర మున్సిపల్ పాఠశాల, తారకరామాకాలనీ డిపెప్, మల్లమ్మపేట డిపెప్, గెస్ట్‌హౌస్‌కాలనీలో గల పాఠశాలలను ఆమె పరిశీ లించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి వరప్రసాద్, ఏఈలు రవి, సురేష్, బీఎల్‌ఓ వోలతో మాట్లాడి పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. లైటింగ్, తాగునీరు, దివ్యాంగుల కోసం ర్యాంపులు, మైదానం చదునుగా ఉంచ డం వంటివాటిని పూర్తి చేయాలని ఆదేశించారు.


బొబ్బిలిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

ఓ అమ్మ బతుకు పోరాటం



అమ్మను మించిన దైవం లేదని ఓ సినీ రచయిత చెప్పినట్టు అమ్మ ఎప్పుడూ అండగా ఉంటుంది.. కష్టమైనా.. నష్టమైనా తానే భరించాలని చూస్తుంది.. బిడ్డకు ఏమాత్రం కష్టం కలగనీయదు. విజయనగరంలోని మయూరి జంక్షన్‌లో గురువారం కెమెరా కంట పడిన ఆ తల్లి ఓ దివ్యాంగురాలు. తను బతకడానికే చాలా కష్టపడాల్సిన పరిస్థితి. అయినా బిడ్డ తనకన్నా ఓ మెట్టు పైనే ఉండాలని తపించింది. తాను ఒంగి భిక్షాటన చేస్తూ బిడ్డను పైన కూర్చోబెట్టుకుంది. ఎండలోనూ అలుపెరుగకుండా ఆమె చేస్తున్న బతుకు పోరాటాన్ని చూసిన వారంతా ఆశ్చర్యపోయారు. కొందరు తోచిన సాయం చేశారు.

- విజయనగరం (ఆంధ్రజ్యోతి)

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


ఉమామహేష్ (ఫైల్)

మక్కువ: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన కన్నంపేట గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు కన్నంపేటకు చెందిన చీపురు ఉమామహేష్(40) బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో వివాహ మండపంలో విద్యుత్ పనులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ వైరు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు స్పందించి బొబ్బిలి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య లలిత ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.నరసింహమూర్తి తెలిపారు.

గంజాయి స్వాధీనం

భామిని: బత్తిలిలోని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ప్రైవేటు బస్సులో ఒడిశా నుంచి ఆంధ్రాకు 12 కేజీల గంజాయిని తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తులను గురువారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ సి.హెచ్.ప్రసాద్ తెలిపారు. దీని విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

కొమరాడ: రాష్ట్ర సరిహద్దులో ఉన్న కూనేరు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రాయగడ నుంచి పార్వతీపురం వైపు వస్తున్న బస్సులో ఒక వ్యక్తి వద్ద ఐదు కిలోల 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. గంజాయి తరలిస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన దీపక్‌రాయ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు గురువారం తరలించినట్లు ఎస్ఐ చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

రాజాం: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా రాత్రి వేలల్లో తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను రాజాం ఎస్ఈబి ఇన్‌స్పెక్టర్ బి శ్రీధర్ ఎస్ఐ ఎం శ్రీనివాసరెడ్డి సిబ్బంది బుధవారం రాత్రి దాడి చేసి రెండు ఇసుక ట్రాక్టర్లును పట్టుకొని సీజ్ చేయడం జరిగిందని సిఐ బి శ్రీధర్ తెలిపారు. నాగావళి నది నుంచి రాత్రి సమయంలో తరలిస్తున్న విషయం తెలుసుకొని మాటువేసి రెండు ట్రాక్టర్లును 9 ఇసుక టన్నులను స్వాధీన పర్చుకొని రాజాం. రేగిడి పోలిస్ స్టేషన్లుకు అప్పగించడం జరిగిందన్నారు.

బాడంగి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. వేగావతి నది ఒడ్డున అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని డ్రైవర్, యజమానిపై కేసు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

భోగాపురంలో ఆటో చోరీ

భోగాపురం: భోగాపురం గ్రామంలో ఓ ఆటో చోరీకి గురయ్యింది. దీనిపై ఎస్ఐ డి.తాతారావు గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డెంకాడ మండలం చుక్కపేట గ్రామానికి చెందిన చుక్క సత్యనారాయణ అనే వ్యక్తి ఈనెల 27న తన ఏపీ 31టీహెచ్ 0134 నెంబరుగల ఆటోలో భోగాపురం గ్రామదేవత పండగకు వచ్చాడు. సుమారు రాత్రి 7గంటల సమయంలో బజారు సమీప హైవే బ్రిడ్జి కింద ఆటోను పార్కింగ్ చేసి, జాతరకు వెళ్లాడు. తిరిగి అదేరోజు రాత్రి 11గంటలకు వచ్చి చూడగా, అక్కడ ఆటో లేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

సీతంపేట: పెద్దబగ్గ గ్రామ సమీపంలో 20 లీటర్ల సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ జగదీష్‌నాయుడు గురువారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పెద్దబగ్గ గ్రామంలో దాడి చేయగా, ఊయక నరసింహ తన ఇంటి పెరట్లో 40 లీటర్ల సారాతో పట్టుబడ్డాడు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి, అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించామని ఎస్ఐ చెప్పారు.

పూరిల్లు దగ్ధం

కొమరాడ: చినఖేర్జిల గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామగ్రి అగ్నికి ఆహుతైంది. వివిధ ధ్రువపత్రాలు, రూ.45 వేల నగదు కాలి బూడిదైనట్లు బాధితుడు రవికుమార్ తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పాటు గ్యాస్ సిలిండర్ పేలడంతో ప్రమాదం తీవ్రంగా జరిగిందని తెలిపారు. విషయం తెలుసుకున్న కొమరాడ ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్‌వో రాఘవ సంఘటన స్థలాన్ని పరిశీలించి...నష్టాన్ని అంచనా వేశారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా


లాడ్జిల్లో రికార్డులు పరిశీలిస్తున్న సీఐ

విజయనగరం క్రైం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ రైల్వేస్టేషన్, ఎత్తుబ్రిడ్జి లాడ్జీల్లో గురువారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాడ్జిల్లో అనుమానిత వ్యక్తులకు ఆశ్రయం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తారకేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

● **బాడంగి:** హెచ్.పాల్తేరు గ్రామస్థులకు ఎస్ఐ ఆర్.జయంతి ఎన్నికలపై గురువారం అవగాహన కల్పించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు వేయాలని, ఎటువంటి ప్రలోభాలకు లోనుకా కూడదని అన్నారు. గ్రామాల్లో వివాదాలు సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయించాలి



ఏఆర్‌వో వరహాలకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పాలకొండ: ఎన్నికల విధుల్లో ప్రత్యేక కేటగిరీ ఉపాధ్యాయులకు, గర్భిణులు, చంటి బిడ్డలు ఉన్న ఉపాధ్యాయినులకు మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ పాలకొండ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శాసపు వాసుదేవరావు, గోగుల సూర్యనారాయణలు కోరారు. ఈ మేరకు గురువారం ఏఆర్‌వో కె.వరహాలుకు వినతిపత్రం అందించారు. మహిళా ఉపాధ్యాయులకు ఏపీవో, ఓపీవోలుగా నియమించాలని కోరారు. ఈ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఏఆర్‌వో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రమణ, జిల్లా కోశాధికారి కె.పద్మజ, సబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తోటపల్లి వెంకన్న హుండీల లెక్కింపు



హుండీలను లెక్కిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల్లో గురువారం హుండీల లెక్కింపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ఈవో వీవీ సూర్య నారాయణ మాట్లాడుతూ గత ఏడాది డిసెంబరు 28 నుంచి ఈ నెల 28వ తేదీ వరకు 91 రోజులకు సంబంధించి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానానికి రూ.3,70,947, కోదండ రామస్వామి ఆలయానికి రూ.10,375 కానుకల రూపంలో అందినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం గ్రూపు దేవాలయాల ఈవో ఎం.ప్రసాద్, ఎం.వకీరునాయుడు, సిబ్బంది ఎం.బలరాంనాయుడు, ఎం.మురళీనా యుడు, గంట శ్రీధర్, భాస్కరరావు, స్వామివారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.4.18 లక్షలు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవమైన పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలోని హుండీలను గురువారం లెక్కించారు. హుండీల ద్వారా 32 రోజులకు రూ.4లక్షల 18 వేల 208 వచ్చినట్టు ఆలయ ఈవో బి.మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మ, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాస్, కె.లత తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో సుగుణ

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని విధిగా తీసుకోవాలని కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి కోరారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో గురువారం గరుగుబిల్లి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పదేళ్లలోపు వయస్సుగల శిశు మరణాల రేటును తగ్గించడమే లక్ష్యమని అన్నారు. దీనికోసం వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, సచివాలయ, మహిళా సమాఖ్య, స్వయం సహాయక సంఘాలు సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలన్నారు. రక్తహీనత, హైరిస్క్‌గా గుర్తించిన గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో రక్తహీనత, హైరిస్క్ గర్భిణులు, బాలింతల వివరాలు, పిల్లల వివరాలు, రక్తహీనత ఉన్న కిషోర్ బాలికల వివరాలు అంగన్‌వాడీ వర్కర్ల వద్ద ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గరుగుబిల్లి సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మకంగా సాగు చేపట్టాలి

పాచిపెంట: వరి పాత వంగడాల స్థానంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రయోగాత్మక సాగును రైతులు చేపట్టాలని వ్యవసాయశాఖ ఏడీఏ మధుసూదనరావు తెలిపారు. మండలంలోని పెదచీపురువలస, శ్యామల గౌరీపురంలో గురువారం ఆయన రైతులకు వరి వంగడాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఖరీఫ్‌లో 13:18 ఎన్‌టీయూ, 1271 వంటి రకాలను సాగు చేసుకుంటే దిగుబడి వస్తుందని తెలిపారు. భూసారం నానాటికీ క్షీణిస్తోందని, భూమిని ఇప్పటి నుంచే బాగు చేసుకోవాలని సూచించారు. భూమిలో సేంద్రియ కార్బన్ పెరగాలంటే తప్పనిసరిగా పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుని పూత దశలో కలియ దున్నుకోవాలని ఆయన వివరించారు. ఈ అవగాహన సదస్సులో వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు, వ్యవసాయ సహాయకులు వినోద్‌కుమార్, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

నిర్ధారణ పరీక్షలు తప్పనిసరి

సాలూరు: ప్రత్యేక అవసరాలగల బాలబాలికలు ఉచిత ఉపకరణాల నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల విద్యా శాఖ అధికారి రాజ్‌కుమార్ కోరారు. స్థానిక రామాకాలనీలో ఉన్న భవిత కేంద్రం వద్ద గురువారం ప్రత్యేక అవసరాలగల పిల్లలకు మెడికల్ అసెస్మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలకు చెందిన 80 మంది దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులు హాజరయ్యారు. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త పి.భానుమూర్తి, వైద్యులు పాల్గొన్నారు.

గుంతను పూడ్చండి సారూ..



రాయగడ రోడ్డు కొత్త అగ్రహారం వీధి ఎదురుగా భారీ గుంత

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని కొత్త అగ్రహారం వీధి ఎదురుగా ప్రధాన రహదారి మధ్యలో భారీ గుంత ఏర్పడడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారు లు, ప్రజాప్రతినిధులకు ప్రధాన రహదారికి ఆను కొని ఉన్న నివాసితులు గుంతను పూడ్చాలని కోరారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విచారకరం. మున్సిపల్ వైస్‌చైర్మన్ కొండపల్లి రుక్మిణి నివాసం సమీపంలో ఈ భారీ గుంత ఉండడం గమనార్హం.

కాలువలు ఎప్పుడు నిర్మిస్తారు?

పార్వతీపురం టౌన్: 'కాలువలు నిర్మిస్తామని మా ఇళ్ల వద్దగల మెట్లు తొలగించారు. ఇప్పటికి నాలుగైదు రోజులవుతోంది. కాలువల నిర్మాణంలో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నాడని పట్టణంలోని 24వ వార్డు నాయుడు వీధికి చెందిన మహిళలు సీఐటీయూ నాయకులు వెంకటరమణ, సూరిబాబుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇళ్ల ముందు కాలువలను నిర్మించకపోతే ఊరుకోనేది లేదని గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద వారంతా నిరసన వ్యక్తం చేశారు. ఇంతలో కార్యాలయానికి వచ్చిన సీఐటీయూ నాయకులతో పాటు మహిళలు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు వద్దకు వెళ్లి తమ సమస్యను తెలియజేశారు. కమిషనర్ స్పందిస్తూ వెంటనే కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.



సీఐటీయూ నాయకుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళలు

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

- కూటమి సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సంధ్యారాణి



పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు: రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని... సాలూరు నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని స్పష్టమవుతోందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం సాలూరులోని తన నివాసంలో పట్టణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు చాలా కష్టాలు పడ్డారని అన్నారు. యువతకు భవితను జగన్ రెడ్డి ఈ జన్మకు ఇవ్వలేడని అన్నారు. రాష్ట్రాన్ని జగన్ తీవ్ర అప్పులపాలు చేశాడని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే అందరికీ తప్పకుండా ఒకటో తేదీ నాటికి జీతాలు పడతాయని...పింఛన్లు అందుతాయని అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వత ఏడు సార్లు విద్యుత్ బిల్లులు పెంచారని అన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీల పెంపు ఉండదని హామీ ఇచ్చారు. వైసీపీకి వ్యతిరేకంగా చేస్తున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, వైకుంఠపు హర్ష, భీమా, అల్లు అప్పయ్యమ్మ, మజ్జి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కూటమిదే ఘన విజయం

- ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర



గీతను అభినందిస్తున్న బోనెల

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘన విజయం సాధించబోతుందని ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయచంద్ర ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఆయన పార్వతీపురంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గంలో విజయం తథ్యమన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఏపీ ప్రజలు చాలా కష్టాలు పడ్డారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగులందరికీ సకాలంలో వేతనాలు అందిస్తామని, పెన్షన్‌దారులకు ఒకటో తేదీ నాటికి పెన్షన్ అందుతుందని భరోసా ఇచ్చారు. కరెంట్ చార్జీల పెంపు ఉండదని, అన్నా క్యాంటీన్‌ను తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలను పక్కాగా అమలు చేస్తామని తెలిపారు.

ఎంపీ అభ్యర్థిని కలిసిన విజయచంద్ర

అరకు పార్లమెంట్ నియోజకవర్గం ఎన్‌డీఏ కూటమి నుంచి ఎంపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న కొత్తపల్లి గీతను పార్వతీపురం అభ్యర్థి బోనెల విజయచంద్ర విశాఖపట్నంలో గురువారం కలిశారు. ఈసందర్భంగా ఆమెను అభినందించారు. పార్వతీపురం నియోజక వర్గం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించాలని ఆహ్వానించినట్టు చెప్పారు.

ఎన్నికల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి

- కురుపాం రిటర్నింగ్ అధికారి రమణ



మాట్లాడుతున్న నియోజవర్గం రిటర్నింగ్ అధికారి వెంకటరమణ

గరుగుబిల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కురుపాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీవీ రమణ సూచించారు. గురువారం మండల కేంద్రంలో పీవో, ఏపీవోలకు ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాజకీయాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో పి.సూర్యనారాయణ, తహసీల్దార్ కె.జయ, ఎంఈవో ఎస్.నాగభూషణరావుతో పాటు రిసోర్స్‌పర్సన్లు, పీవో, ఏపీవోలు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ

కురుపాం: కురుపాం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వి.వెంకటరమణ ఆధ్వర్యంలో గురువారం పీఓ, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుపాం తహసీల్దార్ డీఎస్ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

సీతానగరం: బలిజిపేట మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పీవో, ఏపీవోలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్, ఈవీఎం ప్యాట్‌లపై తహసీల్దార్ జీవీ జనార్దన్ గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో పాటించాల్సిన నియ మాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

తాగునీటి సరఫరాకు చర్యలు



నాగవళి నదిలోని ఇన్‌ఫిల్టర్ బావుల నీటి నిల్వల పరిస్థితి తెలుసుకుంటున్న కమిషనర్

పార్వతీపురం టౌన్: పట్టణ ప్రజలకు ఈ వేసవిలో సంపూర్ణంగా తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం తోటపల్లి నాగావళి నదిలో గల ఇన్‌ఫిల్టర్ బావుల్లో మోటార్ల సామర్థ్యాన్ని పరిశీలించారు. నది నీటిని ఇన్‌ఫిల్టర్ బావుల్లోకి మళ్లించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రధాన, బూస్టర్ పంప్‌హౌస్‌లలో మోటార్ల పనితీరును స్వయంగా పరిశీలించారు. వేసవి కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా తక్షణమే చర్యలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

కొత్తపల్లిని కలిసిన ద్వారపురెడ్డి

గరుగుబిల్లి: అరకు పార్లమెంటు బీజేపీ అభ్యర్థి, మాజీ లోక్‌సభ సభ్యురాలు కొత్తపల్లి గీతను అరకు టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ విశాఖలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి పార్టీలకు చెందినవారు తన గెలుపునకు సహకరించాలని కోరారు. గీతను కలిసిన వారిలో ద్వారపురెడ్డి చంద్రశేఖర్, మీసాల శశిభూషణరావు, కృష్ణమూర్తి, తదితరులు ఉన్నారు.

రెండో ధపా మోసానికేనా యాత్రలు?

గరుగుబిల్లి: పాదయాత్రతో ప్రజలను మోసగించిన జగన్మోహన్‌రెడ్డి రెండో ధపా ప్రజలను వంచించేందుకేనా సిద్ధం యాత్ర నిర్వహిస్తున్నారని అరకు తెలుగు దేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు బి.రామ్‌మోహనరావు ప్రశ్నించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్రలో ముద్దులు ఇచ్చి పిడి గుద్దులు గుద్దారన్నారు. ముఖ్యమంత్రి అయిన తరువాత తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమైన వ్యక్తి ప్రజా సంక్షేమాన్ని విస్మరించారన్నారు. తల్లిని, చెల్లిని చూడలేని జగన్ రాష్ట్ర ప్రజలకు ఏ మేరకు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు ఎస్.వెంకటరమణ, సీహెచ్‌సీ అప్పారావు, పవన్‌లు ఉన్నారు.

108 శివలింగాల ప్రతిష్ఠ



శివలింగాలను అమర్చిన దృశ్యం

భామిని: బత్తిలిలోని లలితా త్రిపురసుందరి దేవాలయంలో 108 శివలింగాలకు గురువారం ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అర్చకులు రంపా శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సామూహిక పూజలు చేశారు.

ఘనంగా ఆరాధన ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరఘట్టం: వండువ జంక్షన్‌లోని శ్రీషిర్డీ సాయి బాబా 106వ ఆరాధన ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పూజలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. 1న దేవతామూర్తుల తిరువీధి ఉత్సవం నిర్వహిం చనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

టికెట్ కేటాయింపులో అసమ్మతి



మాట్లాడుతున్న గంగాధర్, కౌన్సిలర్లు

రాయగడ: రాయగడ జిల్లా బిజూ జనతా దళ్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కేటాయిం పులో అసమ్మతి కుంపటి రాజుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రాయగడ శాసనసభ స్థానానికి బిజద అధిష్ఠానం ఎస్‌డీసీ అధ్యక్షురాలు అనసూయ మాఝికి టికెట్ కేటాయించింది. ఇది నచ్చని నెక్కంటి భాస్కరరావు వర్గానికి చెందిన 21 మంది బిజద కౌన్సిలర్లు తమ అసమ్మతి గళం వినిపించడమే కాకుండా తమ పదవులకు, బిజద సభ్యత్వానికి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. వీరితో పాటు పలువురు సర్పంచ్‌లు కూడా పదవులకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈసందర్భంగా స్థానిక హోటల్‌లో బిజూ జనతాదళ్ సీనియర్ నేత పూర్వ జడ్పీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల అత్యవసర పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేసి, వివరాలు వెల్లడించారు. సుదీర్ఘ కాలం నుంచి పార్టీ పటిష్టతకు ఉన్నతికి కృషిచేసిన ఎంతోమంది సీనియర్లు ఉండగా ఏకపక్ష నిర్ణయంతో అనసూయకు టికెట్లు కేటాయించడం సముచితంగా లేదని అసంతృప్తిని వెలిబుచ్చారు. అందుకే కౌన్సిలర్లు, సర్పంచులు రాజీనామా చేసి హైకా మండ్‌కు పంపించినట్టు తెలిపారు.

అనసూయకే మా మద్దతు

రాయగడ: రాయగడ శాసన సభ అభ్యర్థిగా అనసూయ మాఝికి టికెట్ కేటాయంచడం పట్ల బిజదకు చెందిన మరో వర్గం నేత వై.వెంకటేశ్వరరావు(కొండబాబు) హర్షం వ్యక్తం చేశారు. ఏడు దశాబ్దాల తర్వాత రాయగడ శాసనసభ స్థానం ఓ మహిళకు కేటాయించినందుకు ముఖ్యమంత్రి నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనసూయ మాఝికి టికెట్ కేటాయించడం నచ్చని ఓ నేత 21 మంది కౌన్సిలర్లతో వారికి ఇష్టం లేకపోయినా బలవంతంగా రాజీనామా చేయించారని ఆరోపించారు. ఏది ఏమైనా తామంతా అనసూయ విజయానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. రాజీనామా చేసిన కౌన్సిలర్లు కూడా త్వరలో తమ రాజీనామాను ఉపసంహరించుకుని అనసూయ విజయానికి మద్దతు తెలుపుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

బిసంకటక్, గుణుపురం పాత కాపులకే

రాయగడ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను బిజూ జనతాదళ్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, బిసంకటక్, గుణుపురం నియోజకవర్గాలకు అభ్యర్థులుగా పాతకాపులకే టికెట్లు కేటాయించారు. గుణుపురం అభ్యర్థిగా రఘునాథ్ గమాంగ్‌ను, బిసంకటక్ అభ్యర్థిగా రాష్ట్ర మంత్రి జగన్నాథ సారక మరో మారు టికెట్లు కేటాయించారు. ఈసందర్భంగా వారు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఒడిశా

రాయగడ: ఉత్కళ మీడియా సంఘం తరపున జిమిడిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం ఒడియా భాషా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఉత్కళ మీడియా సంఘం అధ్యక్షుడు దయానిధి ఖడంగా మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఒడియా భాషకు సంబంధించిన పుస్తకాలు లేకపోవడంతో వారు భాషను నేర్చుకోలేపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్ సాహు, హరినారాయణ దాస్, కేకేఎం పట్నాయక్, సరోజ్‌కుమార్‌దాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా..

నేడు జిల్లాకు ప్రవీణ్ ప్రకాష్ రాక

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి/ గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లాకు రానున్నారు. రాత్రికి రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో బస చేయనున్నారు. శనివారం కురుపాం, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ప్రవీణ్ ప్రకాష్ పర్యటనతో జిల్లా విద్యాశాఖ అప్రమత్తమయ్యింది.

వలంటీర్లపై ఫిర్యాదు

మక్కువ: పనసభద్ర గ్రామంలో నలుగురు వలంటీర్లు సామంతుల కృష్ణ, మదనశెట్టి శ్రీను, జన్ని దొరబాబు, మూసిక బాలకృష్ణ వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడమే కాకుండా, ఓటర్లను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. వలంటీర్లు సభలో మాట్లాడిన ఆడియోతో పాటు ఫొటోలను సమర్పించారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘానికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ పి.మల్లేశ్వరరావు, చింతల తవిటినాయుడు, బి.గౌరీశంకర్, కొండగొర్రె సంతోష్ కుమార్, మింది సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

హైజెనిక్ కిట్లు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా గిరిజన గ్రామాల్లోని ప్రజలకు హైజెనిక్ కిట్లను పంపిణీ చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు. కేసర, సోంద్రుకోన, కీసరగూడ గ్రామాల్లోని 60 మందికి వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ పైడా కొండలరావు, సభ్యులు బేత కుమారస్వామి, బీటీడీఏ సభ్యులు రామారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

సీతంపేట: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఆ విభాగ రీజనల్ అధికారి కృష్ణారావు స్పష్టం చేశారు. గురువారం పెదరామ గ్రామంలో ఫుడ్‌బాస్కెట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్యామసుందరరావు, మార్కెటింగ్ ఎస్ఎఫ్ఏ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించండి



సరుకులను పరిశీలిస్తున్న సివిల్ సప్లై అధికారి

సీతంపేట: సివిల్ సప్లయిస్ గోదాముల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల స్టాక్ పాయింట్లకు అందిస్తున్న సరుకులకు సంబంధించి ఎన్నికల నిబంధనలు పాటించాలని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి శివ ప్రసాదరావు స్పష్టం చేశారు. గురువారం స్థానిక గోదామును ఆయన పరిశీలించారు. రికార్డుల ప్రాప్తికి నిల్వలు ఉన్నాయో లేదోనని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డీటీ రమేష్, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య ప్రభావంపై అవగాహన

భామిని: జాతీయ పర్యావరణ కాలుష్య నివారణా దినోత్సవంపై స్థానిక ఏపీ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ గురువారం అవగాహన కల్పించారు. దీనిపై క్విజ్, డ్రాయింగ్ పోటీలు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ జి.బాబూరావు, సైన్స్ అధ్యాపకులు రవికిషోర్ ఎం.జానకి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సాలూరు రూరల్/పాచిపెంట: విద్యతోనే బంగారు భవిష్యత్ సొంతమవుతుందని పాచిపెంట ఎంఈవో1, 2 పల్లి జోగారావు, పోతల సతీష్‌కుమార్‌లు చెప్పారు. పాచిపెంట మండలం కర్రివలస ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం, ఎనిమిదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొర్ర మధుసూదనరావు, తవిటిరాజు, ప్రధానోపాధ్యాయుడు వంశీకృష్ణ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రౌతు సత్యంనాయుడు, మర్రి ఉమా, ఉపాధ్యాయులు మహాలక్ష్మి, సత్యనారాయణ, శ్రీదేవి, సీఎంఆర్టీ గొర్లె హితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

